

ఆరోగ్యాలకు ఎలాంటి లోటు రాకుండా కావల్సిన సదుపాయాలన్నీ అందుబాటులో ఉంటాయి. స్పేస్ స్టేషన్‌లో ఉంటూ అంతరిక్ష వాతావరణంలో రకరకాల పరిశోధనలు చేయడమే వీరి పని. ఒకవేళ స్పేస్ స్టేషన్‌కి ఏదన్నా ప్రమాదం జరిగితే వెంటనే దానికి లంగరు వేసిన వ్యోమనౌకల్లోకి చేరుకునేందుకు సదా సిద్ధంగా ఉంటారు.

గాల్లో దీపం ఎంత అనిశ్చితిగా ఉంటుందో అంతరిక్షంలోకి ప్రయాణమూ అంతే ప్రమాదకరం. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా రెప్పపాటులో పరిస్థితులు తారుమారైపోవచ్చు. కాబట్టి సునీత సురక్షితమే అని నిశ్చింతగా ఉండటానికి లేదు. అసలు తను ISSను చేరుకున్న పరిస్థితులే చాలా అనూహ్యం. తిరిగి వచ్చే క్షణాలూ అంతే ఉద్విగ్నంగా ఉండబోతున్నాయి. అందుకే గుజరాత్‌లో తన తండ్రి ఊరైన జూలాసన్ పల్లెవాసుల నుంచి అమెరికన్ అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ ఆమె రాక కోసం ఎదురుచూస్తున్నారు. అందరి ప్రార్థనలూ ఫలించి, తను సురక్షితంగా తిరిగి వస్తుందనే ఆశిద్దాం.



## రోజుకు 16 సూర్యోదయాలు!

ఒక రోజు ఎన్నిసార్లు ప్రారంభం అవుతుంది. ఇదో పిచ్చి ప్రశ్నగా అనిపించవచ్చు. సూర్యోదయంతో మొదలయ్యే పగలు సూర్యాస్తమయంతో ముగుస్తుంది. కానీ, సునీతా విలియమ్స్ ప్రతిరోజూ 16 సూర్యోదయాలను చూస్తుంది. అవును. తను ఉంటున్న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్... భూమి చుట్టూ గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో తిరుగుతుంది. ఆ వేగంతో పుడమిని చుట్టేందుకు 90 నిమిషాలు సరిపోతుంది. అంటే 24 గంటల్లో దాదాపు 16 సార్లు భూప్రదక్షిణ చేస్తుంది. ప్రతీ సందర్భంలోనూ ఏదో ఒక చోట సూర్యోదయాన్నీ, మరో చోట సూర్యాస్తమయాన్నీ చూస్తుంది. అంటే ఒకో రోజునూ పదహారు సార్లు అనుభవిస్తుంది. పుట్టినరోజులూ, పండుగలూ, కొత్త సంవత్సరాలూ... అన్నీ పదహారుసార్లు వస్తాయి.

## రోజులు ఎలా గడుస్తున్నాయి!

**మనకంటే పగలూ,** రాత్రీ ఉన్నాయి కాబట్టి కిటికీలోంచి తొంగి చూడగానే సమయం గురించి ఓ అవగాహన వస్తుంది. కానీ, అంతరిక్ష కేంద్రంలో అలా కాదు. ప్రతి గంటన్నరకూ భూమిని చుట్టేసే ఈ కేంద్రంలో పగలూ, రాత్రులు ఓ అయోమయం. పోనీ ఓ గడియారం పెట్టుకుందామంటే... అది దేన్ని అనుసరించాలి. బారీ అమెరికన్ సమయాన్నీ, సునీతా భారత కాలమానాన్నీ అనుసరిస్తే! అందుకే వ్యోమగాముల కోసం Coordinated Universal Time (UTC)ను ప్రతిపాదించారు. భూమి వెలుపల ఉండేవారు దీన్ని పాటిస్తారు. భారతీయ కాలమానం కంటే ఇది ఓ ఐదున్నర గంటలు వెనక్కి ఉంటుంది. సమయం ఉంది సరే. ఈ UTCని చాలా జాగ్రత్తగా విభజించుకుని సమయపాలన చేయాల్సి ఉంటుంది. నిద్ర, వ్యాయామంతో పాటు మొక్కల మీద అంతరిక్ష వాతావరణపు ప్రభావాన్ని అంచనా వేయడం, స్పేస్ స్టేషన్ వెలుపలికి వచ్చి నడవడం, తనకు ఇష్టమైన భారతీయ వంటకాలు తినడం... ఇలా సునీత దినచర్య గడుస్తున్నది. పళ్లు తోముకోవడం దగ్గర నుంచీ జుత్తు కత్తిరించుకోవడం వరకూ అక్కడ ప్రతి పనికీ ప్రత్యేకమైన పరికరాలు, నైపుణ్యం, సమయం అవసరమే! పుట్టినరోజుకు కేక్ తయారుచేయడం కోసం కూడా చాలా జాగ్రత్తలు, ప్రత్యామ్నాయాలు అవసరం. అన్నట్టు సునీతా విలియమ్స్ పుట్టినరోజు (సెప్టెంబర్ 19) కూడా అక్కడే జరిగింది. వీటన్నిటి మధ్యా అక్కడి రోజులు హడావుడిగానే సాగుతున్నాయి అంటారు సునీత.

